RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 327 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం గురువారం, 30 మే 2024 పేజీలు : 4 వెల : 2/-

# సంచలన మార్పులకు శ్రీకారం!

## కొత్త అధ్యక్షుడి ఎంపికపై ముమ్మర కసరత్తు




హైదరాబాద్ : తెలంగాణలో రాజకీయ పార్టీలు మార్పులు కూర్పుల దిశగా ముందుకు సాగుతున్నాయి.

మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు సంస్థాగతంగా సంచలన మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పే పార్టీల రాష్ట్ర అధ్యక్షుల నియామకాలపై ఫోకస్ పెట్టాయి కాంగ్రెస్, బీజేపీ. ఇక మరో పార్టీ బీఆర్ఎస్ సైతం ఇదే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీని ఏ రకంగా ముందుకు తీసుకెళ్లాలి? ఎలాగూ రాష్ట్ర అధ్యక్షుడిగా కేసీఆర్ ఉంటారు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ ఆల్రెడీ ఉన్నారు. అడిషనల్ గా ఇంకేమేమి చేయాలి? ఈ దిశగా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు.

**పార్టీల్లో సంస్థాగత మార్పులు..** తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు జూన్ 4న విడుదల కాబోతున్నాయి. అప్పటివరకు రాజకీయ పార్టీల నేతలకు కొంత గ్యాప్ దొరికింది. ఈ గ్యాప్ లో.. ఆయా పార్టీల్లో ఎలాంటి సంస్థాగత మార్పులు చేయాలి? అనేదానిపై అన్ని పార్టీలు దృష్టి పెట్టాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బండి సంజయ్ ని తొలగించిన ఆయన స్థానంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్ రెడ్డిని నియమించారు.

**బీజేపీ కొత్త అధ్యక్షుడు ఎవరు? :** కాగా, అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల వరకు మాత్రమే కిషన్ రెడ్డి అధ్యక్షుడిగా ఉంటారని ముందుగానే జాతీయ స్థాయి నాయకత్వం క్లారిటీ ఇచ్చింది. దాంతో దాదాపుగా జూన్ నెలలోనే కిషన్ రెడ్డి అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవడం ఖాయం. అదే నెలలోనే బీజేపీలో అధ్యక్ష మార్పు ఉండబోతోంది.

**పీసీసీ పగ్గాలు ఎవరికి? :** ఇటు కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే.. ఆ పార్టీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చారు. ఆయన కృషికి ఫలితం దక్కింది. ముఖ్యమంత్రి కూడా అయ్యారు. దీంతో కాంగ్రెస్ కూడా కచ్చితంగా పీసీసీ అధ్యక్షుడిని మార్చబోతోంది. లోక్ సభ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ కి కొత్త అధ్యక్షుడు రానున్నారు.

**పార్టీ బలోపేతం దిశగా కేసీఆర్ అడుగులు..** ఇక బీఆర్ఎస్ విషయానికి వస్తే.. రాష్ట్ర అధ్యక్షుడిగా మొదటి నుంచి కూడా కేసీఆర్ ఉన్నారు. 2019లో బీఆర్ఎస్ మరోసారి అధికారం చేపట్టింది.

ఆ తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కేటీఆర్ కి కట్టబెట్టారు. అధ్యక్షుడిగా కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ ఇద్దరూ.. ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించారు. అయితే అనుకున్న ఫలితాలు రాలేదు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. మళ్లీ కార్యకర్తలను, పార్టీని పునరుత్తేజం చేసేందుకు క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నారు.

**హరీశ్ రావుకి ప్రాధాన్యత..! :** అధికారంలో ఉన్న పదేళ్లు పార్టీని పట్టించుకోలేదు, సంస్థాతగతంగా నిర్మించలేదనే ఒక విమర్శ ఉంది. ఎన్నికలకు ఒక ఏడాది ముందు మాత్రమే అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యాలయాలను ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులను మాత్రమే నియమించింది తప్పితే రాష్ట్ర కార్యవర్గం కానీ జిల్లా కార్యవర్గం కానీ ఎక్కడా లేదు. కాబట్టి కార్యవర్గ నిర్మాణాలతో పాటు, బీఆర్ఎస్ లో ఉన్న మరో కీలక నేత హరీశ్ రావుకి కొంత ప్రాధాన్యత ఇచ్చే దిశగా అడుగులు పడుతున్నట్లుగా తెలుస్తోంది. మొత్తంగా మూడు ప్రధాన పార్టీల్లో ఎలాంటి మార్పులు జరగబోతున్నాయి?

ఆ పార్టీల్లో ఏం జరగబోతోంది? లోక్ సభ ఎన్నికల ఫలితాల తర్వాత ఎలాంటి మార్పులు ఉండనున్నాయి? ఉన్న నాయకత్వాన్ని ఎలా కూర్పు చేయబోతున్నారు? ఇలాంటి అంశాలపై స్పెషల్ అనాలసిస్.. "చక్రం తిప్పే రాష్ట్ర అధ్యక్షులు ఎవరు?"



## తెలంగాణ రాష్ట్ర నూతన చిహ్నం తుది రూపు సిద్ధం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర నూతన చిహ్నం తుది రూపు సిద్ధమైంది. అమరవీరుల పోరాటం, త్యాగాలను ప్రతిబింబించేలా రాష్ట్ర చిహ్నం ఉంటుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కళాకారుడు రుద్ర రాజేశం రూపొందించిన నమూనాపై బుధవారం సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న రాచరిక గుర్తులను చెరిపేస్తూ.. ప్రజాస్వామ్యం, ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా కొత్త లోగోను తయారు చేసే దిశగా కసరత్తు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అందుకోసం 12 నమూనాలు తయారు చేయించారు. ఈ విషయమై ఇటీవల సీపీఐ, సీపీఎం నేతలతో పాటు ఉద్యమకారులు, పార్టీ నేతలు, కొందరు అధికారులతోనూ సీఎం చర్చించారు. ప్రస్తుత చిహ్నంలోని కాకతీయ కళా తోరణాన్ని తొలగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్న చార్మినార్, మూడు సింహాలు, జాతీయ జెండాలోని మూడు రంగులను కొనసాగిస్తూనే.. పోరాటం, త్యాగాలను ప్రతిబింబించేలా మరో గుర్తు పెట్టాలని కొన్ని రోజులుగా పలువురు సూచించినట్లు సమాచారం. రెండ్రోజుల క్రితం రుద్ర రాజేశంతో చర్చించిన సీఎం కొన్ని మార్పులను సూచించారు. ఇవాళ తుది రూపంపై సీఎం సమీక్షలో రుద్ర రాజేశం, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, జేఏసీ నేత రఘు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పలువురు నేతలు పాల్గొన్నారు. సిద్ధమైన నూతన లోగోను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆవిష్కరించనున్నారు.

## తెలంగాణలో జోరుగా పొలిటికల్ బెట్టింగ్ లు.. ఆ మూడు చోట్ల రూ. కోట్లలో పందేలు

హైదరాబాద్ : తెలంగాణలో బెట్టింగ్ ల జోరు పెరిగింది. ఓ వైపు ఐపీఎల్ బెట్టింగ్ రూపంలో లక్షల రూపాయాలు చేతులు మారుతుంటే మరో వైపు లోక్ సభ పోలింగ్ కు ముందే పొలిటికల్ బెట్టింగ్ ల జోరు కాక రేపుతున్నది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య నువ్వా నేనా అన్నట్లుగా రాజకీయం నడుస్తున్న తరుణంలో నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల విజయావకాశాలపై బెట్టింగ్ రాయుళ్లు పందేలు కాస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం మారడం, అభ్యర్థుల ఎంపిక, ప్రచార సరళి ఆధారంగా బెట్టింగ్ లు మారుస్తున్నట్లు తెలుస్తోంది. గతానికి పూర్తిగా భిన్నమైన ఎన్నికల వాతావరణం ఈసారి ఉండటం, మూడు పార్టీలు చావో రేవో అన్నట్లుగా తలపడటం రాజకీయ వాతావరణాన్ని హీటెక్కించింది. దీంతో ఆర్గనైజింగ్ గా బెట్టింగ్ లకు పాల్పడేవారు ఆయా పార్టీల నేతలతో తమకు ఉన్న పరిచయాల ఆధారంగా రిపోర్టులు తెప్పించుకోవడంతో పాటు, సొంతంగా తాము వేసుకున్న లెక్కలు, మీడియా కథనాల సమాచారం ఆధారంగా బెట్టింగ్ ల జోరు పెంచినట్లు తెలుస్తోంది. ఈ పందేలు పట్టణాల నుంచి గ్రామీణ స్థాయి వరకు పెద్ద ఎత్తున జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**హాట్ కేక్ లా ఆ మూడు సెగ్మెంట్లు :** రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితెలంగాణలో పొలిటికల్ బెట్టింగ్స్ ఆ మూడు చోట్ల రూ. కోట్లలోతుల కారణంగా ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధానమైన పోటీ ఉండనుందనే అంచనాకు బెట్టింగ్ రాయుళ్లు వస్తున్నారట. దీంతో ఈ రెండు పార్టీల అభ్యర్థులకు రేషియోలు ఫిక్స్ చేస్తూ భారీ మొత్తంలో బెట్టింగ్ లకు పాల్పడుతున్నట్లు సమాచారం. కీలక నేతలు పోటీ చేస్తున్న నియోజకవర్గాలపై రూ. కోట్లలో పందేలు కాస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కరీంనగర్, మల్కాజ్ గిరి, సికింద్రాబాద్, మహబూబ్ నగర్, మెదక్ వంటి స్థానాల్లో పార్టీతో పాటు అభ్యర్థులకు రాబోయే మెజార్టీపై రూ.లక్షల్లో పందేలు కాస్తున్నారట. కొన్ని పార్టీలో చివరి నిమిషంలో పార్టీలు మారిన వారు అభ్యర్థులుగా ఉండటం, నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు ఆధారంగా పందేలు విలువ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే బెట్టింగ్ రాయుళ్ల వ్యవహారంతో పోలీసులు సైతం అప్రమత్తం అవుతున్నారు. బెట్టింగ్ రాయుళ్లపై నజర్ వేస్తున్నారు.




ప్రస్తుతం పోలింగ్ కు ముందే బెట్టింగ్ లో జోరందుకోగా పోలింగ్ ముగిశాక పోలింగ్ సరళి అంచనాతో, ఆ తర్వాత వెలువడబోయే ఎగ్జిట్ పోల్స్ ఫలితాల అంచనాలతో ఫలితాలపై బెట్టింగ్ లు పందెంగాళ్లు కాళ్లు దువ్వేఅవకాశం ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది.






# మళ్లీ మహారాష్ట్రపై నజర్

## అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ 'సై'

మళ్లీ మహారాష్ట్రపై బీఆర్ఎస్ ఫోకస్ పెడుతున్నది. మరో నాలుగు నెలల్లో ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అక్కడ పోటీ చేయాలని భావిస్తున్నది. ఇప్పటికే అక్కడ పార్టీ కార్యాలయాలను సైతం ప్రారంభించింది. సభ్యత్వాలు చేసి నేతలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించింది. అయితే కేసీఆర్‌కు కాలు విరగడం, అసెంబ్లీ ఎలక్షన్స్‌లో ఓటమితో ఆ స్టేట్‌కు కొంత దూరంగా ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అక్కడ పోటీ చేయకపోవడంతో నైరాశ్యంలో కొంత మంది పార్టీని వీడారు. అయితే ఎలాగైనా అక్కడ అసెంబ్లీ బరిలో నిలిచి సత్తాచాటాలని పార్టీ అనుకుంటున్నది. అందుకోసం పార్టీ అధినేత కేసీఆర్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు సమాచారం.

**గులాబీ పార్టీకి 20 లక్షలకు పైగా సభ్యత్వాలు...** మహారాష్ట్రలో పాగా వేయాలని గులాబీ పార్టీ బాస్ కేసీఆర్ భావిస్తున్నారు. ఆ రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రాబోయే శాసన సభ ఎన్నికల్లో పోటీ చేయాలని కసరత్తు ప్రారంభించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే తెలుగువారు ఎక్కువగా ఉన్న ఔరంగాబాద్, నాందేడ్, కందార్ లోహ, లాథూర్, కొల్లాపూర్‌లో బహిరంగసభలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలతో పాటు పలు సంఘాల నేతలు, వివిధ పార్టీల కార్యకర్తలు గూలాబీ గూటికి చేరారు. నాందేడ్‌లో సొంతభవనంలో పార్టీ ఆఫీసునూ ప్రారంభించారు. స్థానిక సంస్థల్లో పోటీ చేసి మద్దతుదారులతో కలిసి 300లకు పైగా సర్పంచ్, వార్డు సభ్యులను కైవసం చేసుకున్నారు. నాగ్‌పూర్ డివిజన్‌లోని భండారా జిల్లాలో అత్యధికంగా 20, విదర్భ, షోలాపూర్‌లోని 15 గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ గెలుపొందింది. 288 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 20 లక్షలకు పైగా సభ్యత్వాలు చేశారు. గ్రామస్థాయిలో పార్టీ నిర్మాణం చేపట్టారు. అయితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి ప్రభుత్వాన్ని కోల్పోవడంతో పాటు ప్రమాదవశాత్తు కిందపడటంతో కేసీఆర్ తొంటి ఎముక విరుగడంతో మహారాష్ట్రలో పార్టీ కార్యక్రమాలు స్తంభించిపోయాయి. ఆ నేతలకు కలిసే అవకాశం సైతం ఇవ్వలేకపోయారు. కేడర్‌లో సందిగ్ధం నెలకొంది. మహారాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, రైతు సంఘం నేత మానిక్‌రావు కదం, మహారాష్ట్ర బీడ్ జిల్లా ఇన్‌చార్జిగా పనిచేస్తున్న దిలీప్ గోరే రాజీనామా చేశారు. వీరితో పాటు పలువురు వివిధ పార్టీల్లో చేరారు.

**రాష్ట్ర యాక్టివ్ లీడర్లకు 'మహా' ప్రచార బాధ్యతలు!....** జూన్ 4న లోక్‌సభ ఫలితాలు రానున్నాయి. ఆ తర్వాత కేసీఆర్ తన ఫోకస్ అంతా మహారాష్ట్రపై పెట్టనున్నట్టు సమాచారం. ఇప్పటికే అక్కడ పార్టీ సభ్యత్వాలు, శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించారు. 'అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్' నినాదంతో కేసీఆర్ ఆ రాష్ట్ర ప్రజలను ఆకర్షించారు. బీఆర్ఎస్ అధినేత నిర్వహించిన సభలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పార్టీ విస్తరణలో భాగంగా మహారాష్ట్రలో సమన్వయకర్తగా వంశీధర్‌రావును నియమించారు. ఆయనతో పాటు 15 మందితో మహారాష్ట్ర తాత్కాలిక స్టీరింగ్ కమిటీతో పాటు డివిజన్లకు ఇన్‌చార్జీలనూ నియమించారు. కమిటీలు సైతం బలంగా ఉండటంతో ఎలక్షన్ షెడ్యూల్ వెలువడక ముందే పార్టీ కేడర్‌ను యాక్టివ్ చేయాలని భావిస్తున్నారు. అందులో భాగంగానే తెలంగాణలోని యాక్టివ్ లీడర్లకు సైతం అక్కడ ప్రచార బాధ్యతలను అప్పగించాలని యోచిస్తున్నట్టు సమాచారం.

**పార్టీ ప్రోగ్రామ్స్, పోటీపై నేతలకు సూచనలు!...** మహారాష్ట్రకు చెందిన నేతలు తెలంగాణ భవన్‌కు తరచూ వచ్చిపోతున్నారు. పార్టీ కార్యక్రమాలు, పోటీపై వారికి సూచనలు ఇస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. అంతేగాకుండా కేసీఆర్ సైతం పలువురికి ఫోన్ చేసి అసెంబ్లీలో పోటీపై క్లారిటీ ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. పార్లమెంట్ ఎలక్షన్స్ సమయంలో జరిగిన పరిణామాలను వివరిస్తూ ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని నేతలకు భరోసా ఇస్తున్నట్టు తెలిసింది.

అసంతృప్తితో ఉన్న నేతలందరితో టచ్‌లోకి వెళ్లాలని పార్టీ సమన్వయకర్త వంశీధర్‌రావుకు కూడా సూచించినట్టు తెలుస్తోంది. అయితే అక్కడ పార్టీని ప్రజలు ఏ మేరకు విశ్వసిస్తారనేది చూడాలి.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# మోడీ వర్సెస్ రాహుల్

# దేశం మార్పు కోరుకుంటోందా !?

పదేళ్ళ పాటు మోడీ పాలన చూసింది దేశం. అభివృద్ధి చేశామని బీజేపీ నేతలు చెబుతున్నారు. కానీ సగటు ప్రజనీకానికి భారాలు బాగానే పడ్డాయి. గ్యాస్ బండ నుంచి పెట్రోల్ డీజీల్ వరకూ రేట్లు అమాంతం పెరిగాయి. అంతే కాదు ఆహార ద్రవ్యోల్బణం అంతకంతకు అధికం అవుతూ వస్తోంది. ఏమి కొనేటట్లు లేదు తినేటట్లు లేదు అన్న పరిస్థితి ఉంది. బీజేపీ ఎన్నికల్లో ప్రచార అస్త్రాలుగా చేసుకున్న వాటిని తమ విజయాలుగా చెప్పుకుంటున్న వాటిని చూస్తే సాధారణ ప్రజానీకానికి అవి ఎంతవరకూ కనెక్ట్ అయ్యాయి అనిపించకమానదు అంటున్నారు విశ్లేషకులు. 370 ఆర్టికల్ ని రద్దు చేయడం, ట్రిపుల్ తలాఖ్ రాముల వారి ఆలయం అయోధ్యలో కట్టడం మంచిదే. వీటిని ఎవరూ కాదని అనరు. కానీ వీటితో పాటే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. అందులో సగం నెరవేర్చినా బాగుండేది అన్న మాట ఉంది. అలాగే మధ్యతరగతి పేద వర్గాలకు ఊరటను ఇచ్చే చర్యలు అయితే ప్రతిసారీ ప్రవేశపెట్టిన పెద్దగా బడ్జెట్ లో లేవు అనే అంటున్నారు. ఆర్థిక వృద్ధి రేటు కూడా అనుకున్న స్థాయిలో పుంజుకోలేదన్న మాట ఉంది. దీంతో మళ్లీ అధికారంలోకి వస్తే ఏమి చేస్తామన్న దాని మీద బీజేపీ చెప్పేది ఏంటి అంటే జాతీయ వాదం గురించే. ఎంతసేపూ జాతీయ వాదాన్నే నమ్ముకుని ముందుకు పోతున్నారు తప్ప సగటు జీవితాలను ప్రభావితం చేసే అంశాలను అందుకుని వాటిని తాము అజెండాలో పెడతామని చెప్పడం లేదు. మరో వైపు చూస్తే రాహుల్ గాంధీ చాలా విషయాలు చర్చించారు. కాంగ్రెస్ మానిఫేస్టోలో కూడా పేదలు మధ్య తరగతి వర్గాకలు ఊరటను ఇచ్చే హామీలు ఉన్నాయి. ఉద్యోగాల విషయంలో వారికి హామీ ఉంది. ఆర్మీలో అగ్ని పథ్ లాంటి టెంపరరీ జాబ్స్ కాకుండా వాటిని రద్దు చేసి పూర్తి అవకాశాలు ఇస్తామని కూడా చెప్పుకొచ్చారు. అలాగే అనేక కీలక హామీలతో ధరాభారాలు తగ్గిస్తామని కూడా చెప్పారు. మొత్తానికి చూస్తే ఈ దేశంలో నూటికి తొంబై శాతం ఉండే సామాన్యుడు మధ్యతరగతి వర్గాలు కోరుకుంటున్న అంశాలతో కాంగ్రెస్ ప్రచారం చేసింది. ఇక రెండు సార్లు చాన్స్ మోడీకి బీజేపీకి ఇచ్చిన దేశం ఈసారి రాహుల్ వైపు చూస్తుందా అన్న చర్చ కూడా మొదలైంది. భారత్ జోడో యాత్రలో రాహుల్ సామాన్య ప్రజల్లో కనెక్ట్ అయిన విధానం ఆ మీదట ఆయన ప్రసంగాలలో వచ్చిన మార్పు, 2014 నాటికి 2024 నాటికి రాహుల్ మోడీని రాజకీయంగా ఢీ కొట్టిన తీరులో వచ్చిన మౌలికమైన మార్పులు ఇవ్వన్నీ జనంలో చర్చగా ఉన్నాయి. ఈసారి ఇండియా కూటమికి ఒక్క చాన్స్ ఎందుకు ఇవ్వకూడదు అన్నది ఉత్తరాదిన కొంత వినిపిస్తుంది అని అంటున్నారు. సౌత్ ఇండియాలో ఎటూ ఇండియా కూటమికి బలం ఉంది. కేరళ, తమిళనాడు, కర్నాటక, తెలంగాణాలో కలుపుకుంటే ఇండియా కూటమికి 80కి పైగా ఎంపీ సీట్లు రావచ్చు అని ఒక అంచనా ఉంది. ఇక ఉత్తరాదిన మహారాష్ట్ర, బీహార్ యూపీ ఉత్తరాఖండ్ రాజస్థాన్ లలో కూడా కూటమికి ఆదరణ మొదలైంది అని అంటున్నారు. యూపీలో ఈసారి కనీసంగా ఇరవై నుంచి పాతిక దాకా ఎంపీ సీట్లు ఇండియా కూటమి సాధిస్తుంది అని లెక్క వేస్తున్నారు. అలాగే పశ్చిమ బెంగాల్ మహారాష్ట్రలలో కూడా బీజేపీకి గట్టి దెబ్బ పడుతుందని అంటున్నారు. మరో వైపు చూస్తే యూపీలో బీజేపీకి 2019 నాటికే 80 సీట్లకు 62కి నంబర్ పడింది. ఇది 2014లో వచ్చిన 71 సీట్లకు తొమ్మిది తక్కువ. ఈసారి కూడా తగ్గుతుంది అని అంటున్నారు. బీహార్ లో కూడా 2019 నాటికే సీట్లు తగ్గాయి. ఈసారి ఇండియా కూటమి సవాల్ చేస్తోంది అని అంటున్నారు. ఇవన్నీ చూసిన మీదట ఇండియా కూటమికి 200 కంటే ఎక్కువ ఎంపీలు వచ్చే చాన్స్ ఉంది అని అంటున్నారు. ఢిల్లీ పంజాబ్ హర్యానా రాజస్థాన్, మధ్యప్రదేశ్ లలో కూడా ఇండియా కూటమికి కొంత అనుకూలంగా ఉందని అంటున్నారు. అలాగే హిమాచల్ ప్రదేశ్ లో కాంగ్రెస్ గత ఏడాది అధికారంలోకి వచ్చింది. ఆ హవా కొనసాగుతోంది. అసోం లో బీజేపీ వ్యతిరేకత కాంగ్రెస్ కి అనుకూలం కానుంది. ఇవన్నీ చూసినపుడు కాంగ్రెస్ సెంచరీ ని కొట్టడం ఖాయమనే అంటున్నారు. కాంగ్రెస్ వంద, కూటమిలోని ఇతర పార్టీలు మరో వందా సీట్లు తెచ్చుకుంటే మాత్రం ఈసారి ఢిల్లీ పీఠం మీద పందెం కాయడం ఖాయమని అంటున్నారు. మెల్లగా దేశంలో మార్పు కనిపిస్తోంది అని అది ఇండియా కూటమి విజయం మీద ప్రభావం చూపిస్తే ఎంపీ సీట్లు ఇంకా పెరిగినా ఆశ్చర్యం లేదు అంటున్నారు. దేశంలో మార్పు రావాలని కేంద్రంలో కొత్త ప్రభుత్వం రావాలన్నది అంతర్లీనంగా ఉన్న ఒక భావన అని అంటున్నారు. అది ఓట్ల రూపంలో ఎంతవరకూ టర్న్ అయింది అన్న దానిని బట్టే జూన్ 4 తరువాత దేశ రాజకీయ ముఖ చిత్రం మారుతుంది అని అంటున్నారు.

# గ్రామాల్లోకి ఖానాపూర్ ఎమ్మెల్యే విస్తృత పర్యటన

**ప్రజల అవసరాలను గుర్తించి పథకాలు చేస్తామని హామీ**
**అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తామని భరోసా**
**గ్రామాల అభివృద్దే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

















**జన్నారం మే 29 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లోకి ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకొన్నారు.గ్రామాల్లో నేలకొని ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ప్రజల అవసరాలను గుర్తించి పథకాలు చేస్తామని అన్నారు.అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. జన్నారం మండలంలోని రాంతండా, కవ్వాల్, హాస్టల్ తండా, బంగారుతండా, లోతుర్రే, లక్ష్మిపూర్, కొత్తూరుపల్లి తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై గ్రామస్తులు ఎదురుకుంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.త్వరలో సమస్యలను పరిష్కారిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పెదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపిట వేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటయిన 4నెలలోనే గృహ జ్యోతి పథకం ఉచిత కరెంటు,ఆరోగ్య శ్రీ పథకం కింద 10 లక్షల ప్రమాద భీమా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 రూపాయాలకె గ్యాస్, త్వరలో 4వేల పెన్షన్, ఇందిరమ్మ ఇండ్లు,మహిళలకు ఇస్తామన్నారు. గ్రామాల్లో నెలకొన్న రోడ్డు, నీటి, కరెంట్, డ్రైనేజీ, బ్రిడ్జికు సంబందించిన సమస్యలను దశల వారీగా పరిష్కారిస్తామన్నారు. కొత్తూరుపల్లె గ్రామంలో చెరువును కబ్జా చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ డిఈ కి ఫోన్ లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలి

**బిఆర్ఎస్ 10 ఏళ్ళు అధికారంలో ఉండి రైతులకు ఎం చేసింది?**
**నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోండి**
**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**ఉట్నూర్ మే 29(ప్రభాత సమాచారం)**
గతంలో 10ఏళ్ళ పాటు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి రైతుల సంక్షేమానికి ఎం చేసిందో కేటీఆర్ సమాధానం చెప్పాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని అన్నారు. రైతులపై లాఠీ ఛార్జి జరిగిందంటూ...కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, ఆ తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలన్నారు. రైతులను నమ్మించి మోసం చేసి జైలుకు పంపింది మీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు.గతంలో బిఆర్ఎస్ పార్టీ రైతులకు ఎరువులను అందజేస్తామని మోసం చేసిందని, రైతుల గురించి మాట్లాడే అర్హత మీకు లేదన్నారు. కేటీఆర్ ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.రైతుల గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఆగస్టు 15 లోపు రైతుల రుణాన్ని మాఫీ చేస్తామన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పోలిసు, వ్యవసాయ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నా నియోజకవర్గంలో ఎక్కడైన నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హేచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోతల కాన్పులే!

భువనగిరి : జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా శస్త్రచికిత్సల (సిజేరియన్) కాన్పులు చేస్తున్నారు. ప్రతి పది మంది గర్భిణుల్లో ఎనిమిది మందికి ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. కోతలు ఎక్కువగా అవుతున్న ఆసుపత్రులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపింది. ఏప్రిల్ మాసంలో ఎక్కువ శస్త్రచికిత్సలు చేసిన ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోంలలో గణాంకాలను పరిగణనలోకి తీసుకొని మాతా, శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం తనిఖీలు చేపట్టింది. భువనగిరిలో ఇప్పటికే ఆరు ప్రైవేటు ఆసుపత్రుల్లో సోదాలు జరిపింది. చౌటుప్పల్‌లో గుర్తించిన దవాఖానాల్లో దస్త్రాలను పరిశీలించి స్వాధీనం చేసుకుంది. సరైన కారణాలు లేకుండా కాన్పులు చేసిన ఆయా ఆసుపత్రులకు శ్రీముఖాలు జారీ చేసింది. చౌటుప్పల్, రామన్నపేట, వలిగొండ, ఆలేరులో మరో 25 ఆసుపత్రులు, నర్సింగ్ హోంలలో ఇదే పరిస్థితి నెలకొందని అధికారులు గుర్తించారు.

**కారణం లేకుండా..**

సిజేరియన్ల వివరాలు, దస్త్రాలు, కేస్‌షీట్లు, స్కానింగ్ రిపోర్టులను పరిశీలిస్తున్నారు. ఒక్కో ఆసుపత్రిలో చేసిన కాన్పుల్లో 90 శాతానికి పైగా శస్త్రచికిత్సలే ఉంటున్నాయి. వాటిపై సరైన కారణం లేకపోవడంతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేస్తున్నారు. భువనగిరిలోని ఆరు దవాఖానాల్లో తనిఖీ బృందం ప్రసవాల దస్త్రాలను స్వాధీనం చేసుకుంది. గర్భిణులకు మొదటగా సహజ ప్రసవం చేసేందుకు ప్రయత్నం చేయాలి. వీలు కాకుంటే సిజేరియన్ చేయాలి. అలా కాకుండా కొందరు ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు ధనార్జనే లక్ష్యంగా కోతలతో ప్రసవాలు చేస్తున్నారు. మరికొన్ని కేసుల్లో గర్భిణులు పురిటి నొప్పులు భరించలేక శస్త్రచికిత్స వైపు మొగ్గు చూపుతున్నట్లు తనిఖీల్లో తేలింది. ఉమ్మనీరు తక్కువగా ఉన్న సమయంలో, కవల పిల్లలు, గర్భంలో పిండం అడ్డం తిరగడం, మాయ తక్కువ ఉన్న సమయంలోనే సిజేరియన్లకు మొదటగా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ కారణాలు లేకుండానే ఎక్కువ మంది వైద్యులు పొట్టను కోసి బిడ్డను తీస్తున్నారు.

**ఎడాపెడా శస్త్రచికిత్సలు**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్య పెరుగుతున్నా, ప్రైవేటు ఆసుపత్రుల్లో మాత్రం పెద్దగా మార్పులేదు.
జిల్లాలో పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్‌హోంలో సుమారు రోజుకు 40 వరకు ప్రసవాలు చేస్తున్నారు. 2022లో 10,500 కాన్పులు చేయగా అందులో 85 శాతానికి పైగా సిజేరియన్లు ఉన్నాయి.2023లో ప్రైవేటు ఆసుపత్రుల్లో 8,734 కాన్పులు చేశారు. అందులో 1100 మాత్రమే సాధారణం కాగా 7,634 శస్త్ర చికిత్సలు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు ప్రైవేటు ఆసుపత్రుల్లో కేవలం 89 సహజ ప్రసవాలు చేయగా 689 సి-సెక్షన్ చేశారు.

# పల్లెపాలన.. ఆగమాగం

భువనగిరి : సర్పంచుల పదవీ కాలం ముగిసి.. అధికారుల పాలన మొదలై నాలుగు నెలలవుతోంది. నిధుల లేమికి తోడు, తమకున్న శాఖాపరమైన విధులే కాకుండా గ్రామాల ప్రత్యేకాధికారుల అదనపు బాధ్యతలున్నందున సదరు అధికారులు నామమాత్రంగానే పల్లెల ముఖం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ కొరవడిన ఫలితంగా స్థానికంగా పంచాయతీ కార్యదర్శులపైనే భారం పడుతుండటంతో పలు అభివృద్ధి పనులు, మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టడం లేదని తెలుస్తోంది. ప్రత్యేకాధికారుల పాలనకు ముందే పంచాయతీ ఖాతాలు ఖాళీ అయ్యాయన్నది వాస్తవం. ముఖ్యంగా సర్కారు నుంచి కొన్ని నెలలుగా నిధులు జమ కాకపోవడంతో పాలన మొక్కుబడిగా సాగుతోంది. ఇందు కారణంగా పంచాయతీల్లో పారిశుద్ధ్యం చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. ఒక్కో ప్రత్యేకాధికారికి రెండు కంటే ఎక్కువ పంచాయతీల బాధ్యతలు అప్పగించడంతో సమస్యలు పరిష్కారం దిశగా ముందుకు సాగడం లేదంటున్నారు. గతంలో చేపట్టిన పలు పనులకే నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అభివృద్ధిపై ప్రభావం చూపుతోందని స్థానికులంటున్నారు. రానున్న వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడకపోతే ప్రజలు జబ్బుల బారిన పడే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**మాతృశాఖ విధులకే అధిక ప్రాధాన్యం..**

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 1,740 పంచాయతీల్లో గత ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఇందుకు మండల, డివిజన్ స్థాయిలోని గెజిటెడ్ ఉద్యోగులకు రెండు కంటే ఎక్కువ



పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. మిషన్ భగీరథ, నీటిపారుదల శాఖల అధికారులు మాతృశాఖకే పరిమితమవుతున్నారనే ఆరోపణలున్నాయి. వేసవిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునే నేపథ్యంలో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై మల్లగుల్లాలు పడుతున్నారు. గ్రామాల ప్రత్యేకాధికారులు వారంలో కనీసం రెండు పర్యాయాలు కూడా గ్రామాలకు వెళ్లడం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా స్థానికంగా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, ఎంపీడీవోలపై అదనపు భారం పడుతుందనే వాదన ఉంది. ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, పైపుల లీకేజీకి మరమ్మతు, బోర్ల మరమ్మతు పనులు పంచాయతీ ట్రాక్టర్ నెలవారీ బ్యాంకు వాయిదా, గ్రామాల్లో విద్యుత్తు దీపాలు, నెలనెలా విద్యుత్తు బకాయిలు.. ఇవన్నీ కచ్చితంగా చెల్లించాల్సిందే. నిధుల లేమి కారణంగా ఈ బరువు బాధ్యతల గురించి ప్రత్యేక అధికారులు అంటీముట్టనట్లుగా ఉండటంతో గ్రామ కార్యదర్శులే ఎలాగోలా కార్మికులకు జీతాలు సర్దుబాటు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఒక్కో గ్రామ పంచాయతీ రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అప్పుచేసి ఖర్చు చేసినట్లుగా తెలుస్తోంది. పంచాయతీల ప్రత్యేకాధికారుల ఖర్చుల విషయంలో చేతులెత్తేస్తుండటంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతోంది. నాలుగు రోజులు ఉండి పోయే వాళ్లమని ప్రత్యేకాధికారులు దాట వేస్తున్నారనే వాదన వినిపిస్తోంది.

# పక్కా లెక్క.. ఎగవేత కుదరదిక

తాండూరు : జిల్లాలో జరిగే మైనింగ్ అక్రమాలకు ఇక సమూలంగా అడ్డు కట్ట పడబోతోంది. ఎవరు ఎంత ఖనిజం తవ్వారు? రాయల్టీ ఎంత చెల్లిస్తున్నారనే విషయం పక్కాగా తేలి పోనుంది. ఎక్కువ ఖనిజం తవ్వి తక్కువకు రాయల్టీ చెల్లించే వారికి తాఖీదులు జారీ చేసి మిగిలిన రాయల్టీని వసూలు చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (డీజీపీఎస్), ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్ (ఈటీఎస్) సర్వేలను అందుబాటులోకి తీసుకు రానున్నారు. దీనికి సంబంధించి కథనం.

లీజు పొందినవి 223 మాత్రమే..జిల్లాలో లీజు పొంది ఖనిజాలను తవ్వుతున్న గనులు కేవలం 223 మాత్రమే ఉన్నాయి. అక్రమ ఖనిజాల తవ్వకాలు జరుగుతున్న గనులు 70కి పైగానే ఉన్నాయి. వీటిలో పెద్దేముల్, మోమిన్‌పేట, ధారూర్, బంట్వారం, నవాబుపేట, మర్పల్లి, వికారాబాద్ మండలాల్లో సుద్ద, లేటరైట్ గనులు ఎక్కువగా ఉన్నాయి. బషీరాబాద్, తాండూరు మండలాల్లో నాపరాయి గనులు కూడా ఉ న్నాయి.లీజు పొందిన గనుల్లో నాపరాయి 64, లేటరైట్ 75, సున్నపు రాయి 4, స్టోన్ మెటల్ 27, సుద్ద 41, గ్రానైట్ 6, షెల్ 1, క్వార్ట్జిఫెల్స్ పార్ 3, ఫైర్ క్లే 2 చొప్పున ఉన్నాయి. అన్ని గనుల నుంచి తవ్వుతున్న ఖనిజాల నుంచి జిల్లా గనుల శాఖకు రూ.121.01 కోట్ల ఆదాయం సమకూరుతుంది. అయితే గనుల్లో భారీగా ఖనిజాలు తవ్వినా కొంత మాత్రమే తవ్వినట్లు ఆ మేరకు రాయల్టీ చెల్లిస్తున్నారు. అధికారులు కూడా యజమానులు చెల్లించిన రాయల్టీనే ఆదాయంగా భావిస్తు వస్తున్నారు. జిల్లాలో తవ్వకాలు సాగిస్తున్న లేటరైట్, సున్నపు రాయిని



సిమెంటు ఉత్పత్తికి కర్మాగారాలకు తరలిస్తున్నారు. సుద్దను మలేషియా, సింగపూరుకు నూనె శుద్ధి పరిశ్రమలకు, దేశంలోని ఎరువుల తయారీ కర్మాగారాలకు తరలిస్తున్నారు.

హద్దులు దాటి తవ్వకం.. రూ.కోట్లలో అక్రమార్జన

లీజు పొందిన గనుల పేరిట చాలా మంది యజమానులు పక్కనే ఉ న్న స్థలాల్లో హద్దులు దాటి అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. వీటికి రాయల్టీ చెల్లించకుండా విక్రయాలు జరిపి రూ.కోట్లల్లో సంపాదిస్తున్నా రు. మరో పక్క రాజకీయ పలుకు బడిని వినియోగించి కొందరు ప్రభుత్వ భూముల్లోనూ ఖనిజాలను తవ్వి విక్రయాలు జరుపుతున్నారు. అక్రమ తవ్వకాలపై అధికారులు పర్యవేక్షణ లేక పోవడంతో వ్యవహారం సాఫీగా సాగిపోతోంది.

ఆదాయం పెంచనున్న సర్వేలు కొత్తగా అమల్లోకి వస్తున్న డీజీపీఎస్, ఈటీఎస్ సర్వేల ద్వారా అక్రమ తవ్వకాలకు సమూలంగా కళ్లెం పడుతుంది. ఎంత ఖనిజం తవ్వితే ఆ మేరకు రాయల్టీ చెల్లించాల్సి ఉ ంటుంది. దీనికి తోడు అక్రమ మైనింగ్‌ను అధికారులు నిరోధిస్తారు. మొదట డీజీపీఎస్ సర్వే నిర్వహించి లీజు పొందిన గనిలో ఖనిజం తవ్వారా లేదంటే పక్క స్థలంలో తవ్వారా అనే విషయంలో నిర్ధారణకు వస్తారు. ఈటీఎస్ సర్వేలో లీజు పొందిన గనిలో ఇప్పటి వరకు ఎన్ని మెట్రిక్ టన్నుల ఖనిజాలు తవ్వారు? రాయల్టీ ఎంత చెల్లించారని క్షేత్రస్థాయి సర్వేల ద్వారా తేలుతుంది. వ్యత్యాసాలను బట్టి అధికారులు సదరు యజమానులకు తవ్విన ఖనిజాలకు రాయల్టీ చెల్లించాలని తాఖీదులు జారీ చేసి వసూలు చేస్తారు. దీంతో అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

# రూ.కోట్ల నిధులు... అసంపూర్తి పనులు

వేములవాడ: మురుగు కాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ అధికారుల అలసత్వం, గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు, పట్టణ ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అసంపూర్తి పనులతో పెద్ద ఎత్తున మురుగు, వ్యర్థాలు నిలిచి దుర్వాసన వచ్చి ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం రెండేళ్ల క్రితం వేములవాడ పట్టణంలోని ఆలయం ప్రధాన రహదారి నుంచి జగిత్యాల వైపు, మరోవైపు తెలంగాణ కూడలి నుంచి మల్లారం, కోనాయపల్లి వెళ్లే రహదారులకు ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించి వాటిపై సిమెంట్ బిల్లలు వేసి ఫుట్‌పాత్ నిర్మాణ పనులకు దాదాపు రూ.9 కోట్లను మంజూరు చేసింది. దీంతో పనులు మొదలు పెట్టిన గుత్తేదారు తెలంగాణ కూడలి నుంచి మల్లారం, కోనాయపల్లి వెళ్లే రహదారుల వెంబడి కాలువలు నిర్మించి లోపల మురుగు తొలగించకుండానే ఫుట్‌పాత్ నిర్మాణం పూర్తి చేశారు. దీంతో దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఆలయం ప్రధాన రహదారి నుంచి జగిత్యాల వైపు వెళ్లే రోడ్డులోని పనులు నత్తనడకన సాగాయి. ప్రస్తుతం ఇక్కడ పనులు మధ్యలో మిగిలిపోయాయి. రెండు వైపులా కాలువల నిర్మాణం చేసినప్పటికీ ఆలయానికి వెళ్లే పార్కింగ్ స్థలం వద్ద ర్యాంపుల నిర్మాణ స్థలంలో కాలువ ఏర్పాటు చేయలేదు. దీంతో అక్కడ రెండు వైపులా కాలువలు మురుగు, వ్యర్థాలతో నిండిపోయి ఈ రహదారిపై రాకపోకలు సాగించే భక్తులు, స్థానికులు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు.

కాలువపై సిమెంటు పైకప్పులు వేయక...

ఆలయ ప్రధాన రహదారి నుంచి జగిత్యాల వైపు రోడ్డులోని ఇరువైపులా కాలువలు ఏర్పాటు చేసినప్పటికీ వాటిపై సిమెంట్ పైకప్పుల ఏర్పాటు మరిచారు. పనులు మొదలు పెట్టి రెండేళ్లు కావస్తున్నా నేటికీ పూర్తి కాకపోవడంతో పట్ల భక్తులు, ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. రహదారిపై సిమెంట్ వ్యర్థాలు, మట్టి కుప్పలు ఉండటం, వాటిపై ఫుట్‌పాత్ దుకాణాలు నిర్వహించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఉన్న రోడ్డు ఇరుకుగా మారి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మురుగు కాలువలపై సిమెంట్ బిల్లలు వేయకపోవడంతో వ్యాపారులు కాలువలపై కర్ర చెక్కలు వేసుకొని దుకాణాలకు వెళ్లాల్సిన దుస్థితి వ్యాపారులు, భక్తులు, ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని సందర్భాల్లో చెక్కలు దొర్లి కాలువల్లో దిగబడిన సందర్భాలున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. రాజన్న ఆలయానికి ప్రతి సోమ, ఆది, శు క్రవారాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వేలాది మంది భక్తులు, వాహనదారులు అసంపూర్తి పనులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కాలువలపై సిమెంట్ బిల్లలు వేసి పనులను పూర్తి చేయాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

పూర్తి చేసేందుకు చర్యలు

అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. పనులు జరిగే సమయంలో రాజన్న ఆలయంలో మహాశివరాత్రి, శివకల్యాణం వంటి ఉత్సవాలు జరగడంతో జాప్యం జరిగింది. గుత్తేదారుకు మూడు బిల్లుల పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు రాకపోవడంతో ఆలస్యం చేస్తున్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. సతీష్, ఏఈ, ఆర్‌అండ్‌బీ వేములవాడ

# పంపిణీ తక్కువ.. డిమాండ్ ఎక్కువ



పరిగి : వేసవి తుది దశకు వస్తున్నందున వానా కాలం (ఖరీఫ్) పనులకు రైతులు శ్రీకారం చుట్టారు. యాసంగిలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు సాగు ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. నిస్సారంగా మారిన భూములను సారవంతం చేసేందుకు వారం రోజులుగా సేంద్రియ, కోళ్ల ఎరువుతో పాటు ఒండ్రుమట్టిని పొలాలకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ సైతం రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని యత్నిస్తోంది. ఇందులో భాగంగా పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై సరఫరా చేసి నాణ్యమైన ఉత్పత్తులతో పాటు అధిక దిగుబడులను అందించాలని శాస్త్రవేత్తలతో సూచనలు, సలహాలను అందిస్తోంది. కానీ డిమాండ్ తగినట్లుగా సరఫరా చేయకపోవడంతో విత్తనాల కోసం అవస్థలు పడుతున్నారు.

రసాయనిక ఎరువులు వద్దని..

పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో వివిధ రకాల పంటలు కలిపి ఆరు లక్షలకు పైగా సాగు కానున్నాయి. పచ్చిరొట్ట విత్తనాలు భూమికి బలం. ఒక డీఏపీ బస్తా రూ.1300 వరకు ఉండటంతో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. ఎకరాకు కనీసం రెండు బస్తాలు వినియోగిస్తున్నారు. అదే జీలుగ, జనుము అయితే అదనపు పోషకాలు అందిస్తాయి. ఈ విషయంలో క్రమేపి మార్పు రావడంతో విత్తనాలకు డిమాండ్ పెరిగింది. రసాయనిక ఎరువుల వినియోగంతో దిగుబడులు పడిపోవడంతో పాటు వాతావరణ కాలుష్యం, పంట ఉత్పత్తులు విషతుల్యంగా మారుతున్నాయని గ్రహిస్తున్నారు. క్రమక్రమంగా పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకుని నేల గుణగణాలను మెరుగు పరిచేందుకు ప్రయత్నిస్తున్నారు.

వ్యవసాయశాఖ 750 క్వింటాళ్ల జీలుగ, 897 క్వింటాళ్ల జనుము సరఫరా చేస్తోంది. జీలుగ విత్తనాలు 1800 క్వింటాళ్లు, జనుము 3800 క్వింటాళ్లకు అధికారులు ఇండెంట్ పంపారు. మొదటి విడతలో వీటిని పంపిణీ చేయగా రోజుల వ్యవధిలోనే అమ్ముడు పోయాయి. రెండో దఫా సరఫరా జరగకపోవడంతో నిత్యం సమీప వ్యవసాయ కారాలయాలకు వచ్చి వెళ్తున్నారు.

గతేడాది 4వేల క్వింటాళ్లకు పైగా డిమాండ్ ఉంటే రెండు రకాల విత్తనాలు కలిపి కేవలం 2300 క్వింటాళ్ల విత్తనాలే సరఫరా అయ్యాయి. పెరిగిన వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం ఈసారైనా డిమాండ్‌కు సరిపడా సరఫరా చేయాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

రైతులకు అందుబాటులో ఉంచుతాం గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

విత్తనాలకు ఒక్కసారిగా పెరిగిన డిమాండ్‌తో త్వరగా అయిపోయాయి. మళ్లీ తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచుతాం. విచ్చలవిడిగా వాడుతున్న రసాయనిక ఎరువులతో సేంద్రియ కర్బన పదార్థం భూమిలో తగ్గి రైతులకు మేలు చేసే సూక్ష్మక్రిములు లక్షల్లో చనిపోతున్నాయి. ఈ ప్రభావం దిగుబ డులపై స్పష్టంగా పడుతోంది. పచ్చిరొట్ట పట్ల రైతులకు అవగాహన కల్పిస్తూ సాగును పెంచుతాం. భూసారం పెంచేందుకు జిల్లాకు తగినన్ని జీలుగ, జనుము విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. అన్నదాతల్లో వస్తున్న మార్పు ఆహ్వానించదగ్గ పరిణామం. రైతులందరూ ఇదే విధానాన్ని పాటించాలి.

# హైదరాబాద్ సీసీఎస్‌లో ఏం జరుగుతోంది!




హైదరాబాద్ : ఎన్నో సంచలన కేసులను ఛేదించిన నగర సీసీఎస్ వివాదాల కేంద్రంగా మారింది. ఇక్కడ పనిచేస్తున్న కొందరు పోలీసు అధికారులపై అవినీతి ఆరోపణలు చర్చనీయాంశంగా మారా యి. ప్రతిష్ఠ దెబ్బతినకముందే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ఉ న్నతాధికారులు భావిస్తున్నారు. సీసీఎస్‌ను పూర్తి స్థాయి ప్రక్షాళన చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రీ లాంచింగ్ ముసుగులో పలు రియల్ సంస్థలు పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి రూ.వేల కోట్లు వసూ లు చేసి బోర్డు తిప్పేశాయి. వాటిలో సాహితీ ఇన్‌ఫ్రా సాగించిన మోసాల చిట్టాలో వేలాది మంది బాధితులున్నారు. నాలుగేళ్ల కిందట మొదలైన సాహితీ మోసాలపై 2022లో నగర సీసీఎస్‌లో కేసు నమోదైంది. ఈ వ్యవధిలో నగరంలో ముగ్గురు పోలీసు కమిషనర్లు మారారు. సీసీఎస్‌లో ముగ్గురు డీసీపీలు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ప్రతి సీపీ, డీసీపీ సాహితీ కేసు పురోగతిని సమీక్షించారు. వీలైనంత త్వరితగతిన బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దర్యాప్తు అధికారిగా వ్యవహరించిన ఏసీపీ ఉ మామహేశ్వరరావు మాత్రం ఏకపక్షంగా వ్యవహరించారనే ఆరోపణలు న్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఆయన నివాసంలో ఏసీబీ అధికా రులు సోదాలు జరిపారు. ఆదాయాన్ని మించి ఆస్తులున్నట్టు గుర్తించి అరెస్టు చేశారు. అంత కీలకమైన కేసులో ఏసీపీ వెనుక ఉన్న పోలీసు అధికారులు ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ కేసులో పురోగతి లేదని గుర్తించిన ఒకరు దర్యాప్తు అధికారి.. ఉమామహేశ్వరరావును మార్చాలని సిఫార్సు చేశారు. సాహితీ కేసులో స్వాధీనం చేసుకున్న నగదు కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాలంటూ వచ్చిన ప్రతిపాదనను సీసీఎస్ సమీక్ష సమావేశంలో పోలీసు ఉన్నతాధికారి ఒకరు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా తీసుకున్న నిర్ణయంలా పైకి కనిపించినా, దీని వెనుక దాగిన అంతరార్థం గుర్తించి.. ఆ ప్రతిపాదన అమలు చేయకుండా ఆదేశాలు జారీచేశారు. ఇదే తరహాలో ఇద్దరు ఏసీపీలు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఆర్థిక నేరస్తులను కాపాడేందుకు చేసిన చీకటి వ్యవహారాలు కూడా బయటపడుతున్నాయి. మోసగాళ్ల బారిన పడి రూ.కోట్లు నష్టపోయిన బాధితులు ఒక్కొక్కరుగా ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్నారు. కేసుల నమోదు, దర్యాప్తు సమయంలో తమను వేధింపులకు గురిచేసిన వారిపై ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో అప్రమత్తమైన ఉన్నతాధికారులు అంతర్గత విచారణకు ఆదేశించినట్టు సమాచారం. అక్కడినుంచి వచ్చిన నివేదిక ఆధారంగా సీసీఎస్‌లో ఏసీపీ స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకూ బదిలీలు తప్పవని తెలుస్తోంది.

గ్రేటర్ మెట్రోజోన్ లైన్స్ డివిజన్ల పునర్విభజన కమిటీ నియామకం

గ్రేటర్ మెట్రోజోన్ పరిధిలోని లైన్స్ విభాగం నిర్వహణతో పాటు సమస్యలను వేగవంతంగా గుర్తించి పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేసేందుకు కన్‌స్ట్రక్షన్ కమిటీని నియమిస్తూ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకి శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా మెట్రోజోన్ సీజీఎం కె.నర్సింహ స్వామి, రంగారెడ్డి జోన్ సీజీఎం పి.ఆనంద్, మేడ్చల్ జోన్ సీజీఎం సాయిబాబా, స్కాడా ఎస్ఈ, సైబర్ సిటీ ఎస్ఈ వెంకన్న ఉన్నారు. వీరు జూన్ 3వ తేదీ నాటికి అధ్యయనం పూర్తిచేసి నివేదికను దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ సీజీఎండీకి అందజేయాల్సి ఉంది. సబ్ ఇంజినీర్లు, సెక్షన్ అధికారుల విధులు, బాధ్యతల్లో మార్పులు తేచ్చే అవకాశాలపై ఆపరేషన్ , మెయింటేనెన్స్ (ఓఅండ్ఎం) కన్‌స్ట్రక్షన్ ఆఫ్ కమిటీని నియమించారు. ఈ కమిటీలో సభ్యులుగా కమర్షియల్, ఓఅండ్ఎం, పర్చేజెస్ అండ్ మెటల్ మేనేజ్‌మెంట్ (పీఅండ్ఎంఎం), ఫైనాన్స్ డైరెక్టర్లు, బంజారాహిల్స్, సైబర్‌సిటీ ఎస్ఈలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ ఇంజినీర్లు సాంకేతిక పరమైన సమస్యల పరిష్కారంలో మార్పులు తీసుకురానున్నారు.

# దారి మూసేసి.. ధర పెంచేసి

పరిగి : నగర శివారుల్లో స్థిరాస్తి వ్యాపారులు బరితెగించి వ్యవహరిస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీ పేరిట ఏకంగా కాలనీ రోడ్లనే కబ్జా చేస్తూ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నా సంబంధిత అధికారుల్లో చలనం లేదు. గేటెడ్ కమ్యూనిటీ విల్లాలకు మంచి డిమాండ్ ఉండటంతో బిల్డర్ నిబంధనలను తుంగలో తొక్కి కాలనీ రోడ్డును ఒకవైపు పూర్తిగా మూసేలా ప్రహరీ నిర్మించి గేటెడ్ కమ్యూనిటీగా మార్చేశాడు. గండిపేట మండలం బండ్లగూడజాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ రెవెన్యూలో చాలాకాలం క్రితమే యాదాద్రి కాలనీ వెలసింది. దీనికి ఆనుకొనే మరికొన్ని కాలనీలున్నాయి. కిస్మత్‌పూర్–ఎక్సయిజ్ అకాడమీ మార్గంలోని ఈ కాలనీకి 40 అడుగుల విస్తీర్ణంలో రోడ్డు ఉంది. ఈ మార్గంలోనే ఓ స్థిరాస్తి వ్యాపారి అర ఎకరం స్థలాన్ని కొనుగోలు చేసి రోడ్డుకు ఇరువైపులా పది విల్లాలు నిర్మించాడు. కాలనీ రోడ్డులో నిర్మాణాలు చేపట్టడంతో విల్లాలకు అనుకున్న డిమాండ్ రాలేదు. దీంతో ఆయనలో దుర్బుద్ధి మొదలైంది. రోడ్డును తన ఆధీనంలోకి తీసుకునేందుకు కార్పొరేషన్ యంత్రాంగాన్ని మచ్చిక చేసుకొని రాత్రికిరాత్రే.. విల్లాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాడు. స్థిరాస్తి వ్యాపారి విల్లాల నిర్మాణానికి ఇండిపెండెంట్ ఇళ్ల నిర్మాణాల పేరుతో అనుమతులు తీసుకొని 175 గజాల్లో ఒక్కో విల్లా నిర్మించాడు. బహిరంగ మార్కెట్‌లో ఇండిపెండెంట్ ఇళ్లకు చదరపు అడుగు రూ.4వేలు పలుకుతుండగా.. గేటెడ్ కమ్యూనిటీలో మాత్రం ఏకంగా రూ.7వేలు నుంచి రూ. 8 వేలు ధర పలుకుతోంది. ఒక్కో విల్లాను మార్కెట్‌లో రెండింతల ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నాడు. ఇందుకోసం అడ్డంకులను అధిగమించేందుకు కార్పొరేషన్‌లోని కీలక అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు ఇచ్చాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలనీ వాసుల ఇబ్బందులు..యాదాద్రి కాలనీకి చెందిన ప్రధాన రహదారిని స్థిరాస్తి వ్యాపారి కబ్జా చేయడంతో.. ఇక్కడి కాలనీవాసులు మరోకాలనీకి చెందిన రోడ్డులో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం గేటెడ్ కమ్యూనిటీలో అపార్టుమెంట్‌లు, విల్లాలు నిర్మించాలంటే కొనుగోలు చేసిన స్థలంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా స్థలం వదిలిపెట్టాలి. ఇక కమ్యూనిటీ వాసులకు పార్కులు, ఇతరత్రా మౌలిక సౌకర్యాలు కల్పించాలి. ఇక్కడ ఇలాంటి నిబంధనలేవీ అమలు కాలేదు. కాలనీవాసులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నాం' అని చెప్పడం గమనార్హం.

# అప్రమత్తతే కీలకం

జగిత్యాల : వచ్చే వానాకాలంలోనూ మంచి వర్షపాతం ఉ ంటుందన్న వాతావరణ శాస్త్రవేత్తల అంచనాలు ఆనందాన్ని కలిగిస్తున్నా.. పంట ఉత్పాదకాల విక్రయంలోని మోసాలు మాత్రం తమను కుదేలు చేయకుండా అన్నదాతలు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. నకిలీల నిరోధానికి గట్టి చర్యలుంటాయని రాష్ట్రమంత్రులు పేర్కొన్నా క్షేత్రస్థాయి అమలు అవశ్యంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో వానాకాలం వరి, పత్తి, మిరప, మక్క తదితర పంటలను దాదాపుగా 12 లక్షల ఎకరాల్లో పండించనున్నారు. ప్రతి సీజన్‌లోనూ పత్తి, వరి, కూరగాయలు, మక్క మిరప తదితరాల్లోనే నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. ప్రభుత్వం అనుమతించని బీటీ3 పత్తివిత్తనాల సాగును శాస్త్రవేత్తలు రైతుల క్షేత్రాల్లో గుర్తించటం, నకిలీ పత్తి విత్తనాలు, నిషేధిత గడ్డిమందైన గ్లైఫోసేట్‌ూడా పట్టుబడుతుండటం నిఘాలోపాన్ని కళ్లకు కడుతోంది. గంటగుళికలు, బయోలు, సేంద్రియ ఎరువులు, పోషకాల మిశ్రమమంటూ పలు రకాలుగా గ్రామాల్లో అడ్వాన్సు బుకింగులు తీసుకుని వాహనాల్లో గుట్టుగా రైతుల ఇళ్లవద్దకు వీటిని సరఫరా చేస్తారు. ఇలాంటి మోసపూరిత ఉత్పత్తులతో సాలీనా కనీసం రూ.75 కోట్లకుపైగా ప్రత్యక్ష నష్టం, నకిలీలతో దిగుబడిరాక పరోక్షంగానూ రూ.260 కోట్లకుపైగా రైతులు నష్టపోతున్న అంచనా ఆందోళనకరంగా ఉంది.

సంకరాల్లోనే ఎక్కువ

బీటీపత్తి, సంకర వరి, మిరప, మక్క, కూరగాయలు తదితర పంటల్లో కిలోలు, గ్రాముల బరువు విత్తనాలకే వేలల్లో ధరుండటంతో అక్రమార్కులు నకిలీ విత్తనాలను తయారు చేసి విక్రయించి రూ.లక్షల్లో సంపాదిస్తుంటారు. జిన్నింగ్ మిల్లుల నుంచి తెచ్చిన పత్తి గింజలు, మార్కెట్లో కొన్న మక్కలను, పొడిపరిశ్రమ నుంచి తెచ్చి మిరప గింజలు, ఇతరత్రా సాధారణ పద్ధతుల్లో సేకరించిన కూరగాయల గింజలకు విత్తనశుద్ధి మందును పట్టించి అందమైన కవర్లు, డబ్బాల్లో నింపి పేరున్న కంపెనీల పేరిట లేదా నూతన విత్తనాలంటూ ప్రతి పంటకు రైతులకు అంటగడతారు. మధ్యవర్తులు, కొందరు దుకాణదారులు, అధికారులు వీరికి సహకరిస్తుండటంతో నకిలీ విత్తనాలు రైతులకు చేరి దిగుబడిరాక నష్టపోతున్నారు.

అధీకృత డీలర్లు

విత్తన నియంత్ర చట్టం 1983లో సీడ్ యాక్ట్ 1966 ప్రకారం డీలర్లు ప్రభుత్వం లైసెన్సులు కలిగి ఉండాలి. ప్రభుత్వం ద్వారా అనుమతి పొందిన విత్తన కంపెనీల వద్ద మాత్రమే విత్తనాలు తీసుకుని రైతులకు విక్రయించాలి. విత్తన వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. దుకాణాల్లో ధరల పట్టికను రైతులకు కనిపించేలా ఉంచాలి. నాణ్యమైన విత్తనాలనే సరఫరా చేయాలి, బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి. ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం దుకాణదారులు లైసెన్స్‌లో నమోదు చేసుకున్న ఎరువులను మాత్రమే విక్రయించాలి. డీలరు తమ వద్ద ఉ న్న ఎరువులను, వాటి ధరలను బోర్డుపైరాసి రైతులకు కనిపించేలా దుకాణాల్లో ఏర్పరచాలి. రైతులకు రసీదులు ఇవ్వాలి. నిల్వలు చూపిన ఎరువులను అమ్మడానికి నిరాకరించినా, గరిష్ఠ ధరల కంటే అధికంగా విక్రయించినా చట్టరీత్యా నేరమే. ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాలు లేని, కల్తీ ఎరువులను విక్రయించరాదు. నిర్దేశించిన కనిష్ఠ పోషకాల శాతాన్ని తెలియజేయకుండా విక్రయించరాదు. నాణ్యతలేని ఎరువులు, చిరిగిన, తేమ వచ్చిన బస్తాలుంటే వాటిపై ఎర్రటి సిరాతో ఇంకు గుర్తు వేయాలి. రైతులు వాటిని కొనరాదు. రైతులు కోరితే డీలరు ప్రతి బస్తాను తూకంవేసి ఇవ్వాలి. రంగు, రూపు, స్వభావంలో తేడా, తేమఉండి, గడ్డకట్టిన ఎరువుల్లో నాణ్యత లోపిస్తుంది. ఒక ఎరువు గుళిక ప్రమాణంలో, ఆకారంలోనూ తేడాలుంటే కల్తీగా గుర్తించాలి.

రైతులు చూడాల్సినవి

పరిశోధనస్థానాలు, ప్రభుత్వ అనుమతిగల దుకాణాల్లోనే విత్తనాలు కొని బిల్లులు తీసుకోవాలి, గ్రామాల్లో జీరోకింద ఎలాంటివి కొనవద్దు. విత్తనాల సంచిపైగల తయారీ స్థలం, కంపెనీ, ఫోన్‌నెంబరు, లాట్, బ్యాచ్‌నంబరు, గడువు, జన్యుస్వచ్ఛత, మొలకశాతం, ధర తదితర పూర్తి వివరాలను పరిశీలించాలి. సంచిపైగల క్యూఆర్‌కోడ్‌ను స్కాన్‌చేస్తే వివరాలు సెల్‌ఫోన్లలో వెల్లడికావాలి. విత్తనాలను బస్తాపైగానీ, ప్యాకెట్లపైగానీ విత్తన వివరాలు లేబుల్ రూపంలో లేకపోతే నకిలీవని గుర్తించాలి. నకిలీ విత్తనాల ప్యాకెట్లపై లాట్ నంబరు ఉండదు. నకిలీవని అనుమానం వస్తే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలి.

మేలైన విత్తనాలు తీసుకోవాలి

సంకరరకాల్లో మొదటిపంటకే నిర్దేశిత దిగుబడి వస్తుంది. కానీ సాధారణ గింజలకు రంగుపూసి హైబ్రిడ్స్‌గా అమ్మినపుడు విత్తనాలను చూసి గుర్తుపట్టలేరు. నకిలీ విత్తనాలు వేస్తే మొక్కలు మొలచినా పూత, కాత తగ్గుతుంది. కాబట్టి డీలర్లవద్ద మేలైన విత్తనాలను తీసుకోవాలి.డాక్టర్ జి.శ్రీనివాస్, ఏడీఆర్, జగిత్యాల పరిశోధనస్థానం

బిల్లులు భద్రపరచాలి

రైతులు ఏ పంట ఉత్పాదకాన్ని కొన్నా తప్పనిసరిగా రశీదులు పొంది పంట పూర్తయ్యేవరకు వాటిని భద్రపరచాలి. గ్రామాల్లో మధ్యవర్తులు, జీరోకింద విక్రయించే ఎలాంటి ఉత్పాదకాలను కొనుగోలు చేయవద్దు. జీరో అమ్మకాల వివరాలను వ్యవసాయాధికారులకు తెలపాలి.బి.వాణి, జిల్లా వ్యవసాయాధికారిణి, జగిత్యాల

# ఇంటింటా పూల పరిమళం..!

సూర్యాపేట : నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని 19 పురపాలికల్లో హరితహారం అమలుకు పుర అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పట్టణ ప్రగతి కింద ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు పెంచారు. వర్షాలు కురవడమే తరువాయి అన్నట్లుగా సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. పట్టణాల్లో ఎక్కడెక్కడ మొక్కలు నాటాలో ఆయా ప్రదేశాలను గుర్తిస్తున్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో 20,73,200 మొక్కలు నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.ముందస్తుగా అంచనాల రూపకల్పన

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పురపాలికల పరిధిలో గుర్తించిన స్థలాల్లో, ఇళ్లల్లో పూలు, పండ్ల మొక్కలు నాటించేందుకు ముందుగానే అంచనాలు రూపొందించారు. ఇందుకు పట్టణ ప్రగతి నిధులు వెచ్చించి శాశ్వత పట్టణ నర్సరీలు నెలకొల్పారు. ఆయా నర్సరీలలో గతేడాది నవంబరు నెల నుంచే మొక్కల పెంపకానికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు. ఇందుకు నాణ్యమైన మట్టి, విత్తనాలు తెప్పించి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి మొక్కల పెంపకం చేపట్టారు. విత్తనాలు మొలకెత్తి ఎదిగేందుకు సేంద్రియ ఎరువులు వినియోగించడంతోపాటు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు.నాటే మొక్కలివే..నివాస ప్రాంతాలు, ఇళ్లల్లో ప్రజలతో మొక్కలు నాటించేందుకు ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు పట్టణ నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశారు. గులాబీ, మల్లె, మందార, గోరింటా, చామంతి, పారిజాతం, తులసి, జామ, ఉసిరి, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, అల్లనేరేడు, చింత, వేప, గుల్‌మోహర్, చైనాబాదం, వాటర్ యాపిల్, కానుగ, బాదం, మారేడు, ఎర్రచందనం, శ్రీగంధం, బాహినియా, కదంబం, సెల్టోఫాం, టెకొమా, టేకు, స్పాథోడియా, నెమలినార, నీలగిరి తదితర మొక్కలు పెంచారు. వర్షాలు కురిస్తే వీటిని పంపిణీ చేసేందుకు ఇప్పటికే నర్సరీల్లో సిద్ధంగా ఉంచారు.




హైదరాబాద్: సుమారు 1200 మంది ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అంగీకరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఆయన వాంగ్మూలంలో పేర్కొన్న కీలక విషయాలు బయటకు వచ్చాయి.

ప్రధానంగా ప్రతిపక్ష నేతలపై నిఘా పెట్టామని, వారికి వెళ్లే డబ్బును అడ్డగించి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నేతలు, జడ్జిలు, స్థిరాస్తి వ్యాపారుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు అంగీకరించారు. కన్వర్జెన్స్ ఇన్నోవేషన్ ల్యాబ్ సాఫ్ట్‌వేర్ సాయంతో ట్యాపింగ్‌కు పాల్పడినట్లు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ పర్యవేక్షణ కోసం 17 కంప్యూటర్లను వినియోగించామని, 56 మంది ఎస్‌వోటీ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ట్యాపింగ్ ఆపేయాలని ప్రభాకర్‌రావు నుంచి ఆదేశాలు అందినట్లు చెప్పారు. ఆయన రాజీనామా చేసే ముందు రికార్డులన్నీ ధ్వంసం చేయాలని సూచించినట్లు తెలిపారు. రికార్డులు ధ్వంసం చేసి కొత్తవాటిని అమర్చామని పేర్కొన్నారు. ధ్వంసం చేసిన ఆధారాలను నాగోలు, మూసారాంబాగ్ వద్ద మూసీ నదిలో పడేసినట్లు వెల్లడించారు. సీడీఆర్, ఐడీపీఆర్ డేటా మొత్తం కాల్చేసినట్లు పేర్కొన్నారు. ఫార్మాట్ చేసిన ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లను బేగంపేట నాలాలో పడేసినట్లు తెలిపారు.




## పిల్లలు లేకపోతే మేం బతకలేం!.. పెంపుడు తల్లిదండ్రుల రోదన

'కడుపున మోయకున్నా.. గుండెల్లో దాచుకుని పెంచుకుంటున్నాం.. పేగుబంధం కాకున్నా కంటిపాపలా చూసుకున్నాం.. దయచేసి మా బిడ్డను తీసుకెళ్లొద్దు' అంటూ దంపతులు ఓ వైపు. ఏడాది నుంచి రెండేళ్లుగా వారి ఆలనాపాలనలో పెరిగిన పిల్లల ఏడుపులు మరోవైపు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీసు కమిషనరేట్ కార్యాలయ ప్రాంగణంలో కనిపించిన ఈ దృశ్యాలు చూపరులను కంటతడి పెట్టించాయి.




పుణె రోడ్డు ప్రమాదం కేసులో జువైనల్ జస్టిస్ బోర్డు వ్యవహారశైలి వివాదాస్పదంగా మారడంతో రాష్ట్ర ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టింది. మహిళా, శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కమిటీని నియమించింది. మద్యం తాగి రోడ్డు ప్రమాదానికి కారణమైన బాలుడికి అతి తేలిగ్గా బెయిల్ ఇవ్వడంపై విచారణ జరపనున్నారు. ఈ విషయంలో నిర్ణయం తీసుకొన్న జువైనల్ బోర్డు అధిపతి డాక్టర్ ఎల్ఎన్ దన్వాడే పాత్రపై దర్యాప్తు చేయనున్నారు. ఈ ప్రమాదం కేసు జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుటకు రాగానే 300 పదాలతో వ్యాసరచన చేయమనడం, 15 గంటలు ట్రాఫిక్ పోలీసులకు సాయం..తదితర నిబంధనలతో తక్షణమే బెయిల్ ఇచ్చేసింది. ఈ నిర్ణయంతో దేశ వ్యాప్తంగా విమర్శలు మొదలయ్యాయి. దీంతో తిరిగి నిందితుడిని అదుపులోకి తీసుకొని జైలుకు తరలించారు. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు, డాక్టర్లు నిందితుడికి సాయం చేసినట్లు తేలడంతో.. ఇప్పుడు జువైనల్ బోర్డుపై ప్రభుత్వం దృష్టిపడింది. దీంతో ఐదుగురు సభ్యుల కమిటీని నియమించింది. ఇది విచారణ జరిపి వచ్చే వారం మహిళా శిశు అభివృద్ధి శాఖకు నివేదికను సమర్పించనుంది. పోర్ష్ కారు ప్రమాదం జరిగిన సమయంలో బాలుడు మద్యం తాగి ఉన్నట్లు తాజాగా అతడి మిత్రులు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. వారిని దర్యాప్తు అధికారులు ఆరు గంటలపాటు విచారించారు. ప్రమాద సమయంలో నిందితుడు కారు డ్రైవ్ చేయనట్లు చూపించాలని అతడి కుటుంబ సభ్యులు తీవ్రంగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు వైద్యులు డబ్బుకు కక్కుర్తిపడి నిందితుడి రక్త నమూనాలను మార్చేసినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. దీంతో వారిని అరెస్టు చేశారు. ఇద్దరు పోలీసు అధికారులు ఇప్పటికే సస్పెండ్ అయ్యారు.


ప్రభాత
సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194





బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్ ఆగడంలేదు. పలు అంతర్జాతీయ నెంబర్ల నుంచి రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్ వస్తున్నాయంటూ రాజాసింగ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తనకు వచ్చిన బెదిరింపు కాల్స్ నెంబర్లను ఆయన ట్విట్ చేశారు. బెదిరింపు కాల్స్ తనకు కొత్త కాదని.. గతంలో ఎన్నో ఫిర్యాదులు చేసినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఒక బాధ్యతగల పౌరుడిగా తనకు వస్తున్న బెదిరింపు కాల్స్ గురించి పోలీసుల దృష్టికి తీసుకెళు న్నట్లు తెలిపారు. గతంలోనూ రాజాసింగ్‌ను చంపేస్తామంటూ బెదిరింపు కాల్స్ రావడం ఆ కాల్స్ పాకిస్తాన్ నుంచి వస్తున్నాయంటూ రాజాసింగ్ ఆరోపించిన విషయం తెలిసిందే. తాజాగా ఏయే నెంబర్ల నుంచి తనకు ఫోన్లు వస్తున్నాయనే విషయాన్ని రాజాసింగ్ తెలిపారు.

**రాజాసింగ్‌కు వార్నింగ్ :** బెదిరింపు కాల్స్‌పై ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా ఫలితం లేదని రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బెదిరింపు కాల్స్‌పై చర్యలు తీసుకుంటారా.. లేదా అనేది చూడాలన్నారు. ఈరోజు తనకు వరుసగా బెదిరింపు కాల్స్ వచ్చాయని.. పాలస్తీనాకు చెందిన వ్యక్తిగా తెలుస్తోందని రాజాసింగ్ వెల్లడించారు. ధర్మం కోసం నువ్వు పనిచేస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. తన ఫ్యామిలీని కూడా చంపేస్తామని బెదిరించారన్నారు.

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఇలాంటివి ఎన్నో కాల్స్ వచ్చాయన్నారు. వాటిపై.. ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారని.. ఆయన ప్రభుత్వం వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలన్నారు.

## దిల్లీ మద్యం కేసు.. కోర్టు పరిగణనలోకి ఈడీ అనుబంధ ఛార్జిషీట్




దిల్లీ: దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో మద్యం విధానం మనీలాండరింగ్ కేసు విచారణ జరిగింది. ఈనెల 10న భారాస ఎమ్మెల్సీ కవిత, ఇతర నిందితులపై ఈడీ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. కవిత, చరణ్ ప్రీత్, దమోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ సింగ్‌ను నిందితులుగా ఈడీ పేర్కొంది. ప్రస్తుతం కవిత, చరణ్‌ప్రీత్ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. కవిత, చరణ్‌ప్రీత్‌కు ప్రొడక్షన్ వారెంట్లు జారీ చేసిన కోర్టు.. తదుపరి విచారణను జూన్ 3కు వాయిదా వేసింది.

## రేవంత్ మౌనానికి కారణమదేనా? లక్ష్మణ సంచలన కామెంట్స్..

హైదరాబాద్, మే 29: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ సంచలన కామెంట్స్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తులో అనేక సంచలనాత్మక విషయాలు బయట పడుతున్నాయని.. ఈ వ్యవహారంపై రేవంత్ సర్కార్ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. తప్పు చేస్తే జైలుకు పంపిస్తామని రేవంత్ చెప్పారని.. ఇన్ని సంచలన విషయాలు బయటకు వస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు స్కామ్‌పై దర్యాప్తు, విచారణ అన్నారు.. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పత్రాల లీక్‌పై చర్యలు అన్నారు.. డ్రగ్స్‌పై చర్యలన్నారు.. ఏవీ పట్టించుకోవడం లేదని రేవంత్ సర్కార్ తీరును లక్ష్మణ్ తూర్పారబట్టారు. పోలీసు అదికారులు కేసీఆర్ ప్రమేయంతోనే జరిగిందని చెప్పారని.. వాంగ్మూలంలో స్పష్టంగా పేర్కొన్నారని లక్ష్మణ్ గుర్తు చేశారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో ఒక మాఫియాను నడిపించారని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రయోజనాల కోసం నాయకులు, ఇతర వ్యక్తుల ఫోన్లను ట్యాపింగ్ చేశారని లక్ష్మణ్ విమర్శించారు. చివరికి జడ్జిల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు అరెస్ట్ అయిన అధికారులు చెబుతున్నారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితుడిగా ఉన్న సీఎం రేవంత్.. ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని లక్ష్మణ్ ప్రశ్నించారు. ఢిల్లీ ఒత్తిళ్లకు లొంగిపోయారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అక్రమ సంపాదన డబ్బులను తరలించేందుకు పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేశారంటూ లక్ష్మణ్ విమర్శించారు. కేసీఆర్, ఆయన అల్లుడు హరీష్ రావుల పేర్లను పోలీసు అధికారులు తమ వాంగ్మూలంలో చెప్పారని లక్ష్మణ్ ఉటంకించారు. వామపక్ష తీవ్రవాదానికి సంబంధించిన డేటాను కూడా ధ్వంసం చేశారన్నారు. దేశ భద్రతకు విఘాతం కలిగించేలా చేశారని ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి తమ పార్టీ హై కమాండ్ ఒత్తిడికి లొంగారా? అందుకే ఫోన్ ట్యాపింగ్‌పై చర్యలు తీసుకోవడం లేదా? అని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడేనని.. ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం అవుతుందన్నారు బీజేపీ ఎంపీ. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం ఫేక్ సినిమా డ్రామా అని తాను ముందే చెప్పానన్నారు.



లిక్కర్ కేసులో కవితను గట్టెక్కించేందుకు ఎమ్మెల్యేల కేసు బయటకు తీసుకొచ్చారన.. దారుణమైన స్థితికి కేసీఆర్ దిగజారాడని లక్ష్మణ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ద్రోహానికి పాల్పడిందని.. నీచమైన స్థాయికి దిగజారిందంటూ మండిపడ్డారు లక్ష్మణ్. రేవంత్‌పై ఢిల్లీ పెద్దల ఒత్తిడి లేదంటే వెంటనే ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులు, పాత్రదారులపై చర్యలు తీసుకోవాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అంతేకాదు.. ఈ కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ జరిగితేనే న్యాయం జరుగుతుందన్నారు. కేసీఆర్.. దిగజారుడు రాజకీయాలు చేశారని.. వ్యక్తిగత స్వేచ్ఛను హరించారంటూ ఫైర్ అయ్యారు.

**అందే శ్రీ పాటను స్వాగతిస్తున్నాం..** తెలంగాణ రాష్ట్ర పాటగా అందే శ్రీ పాటను స్వాగతిస్తున్నామని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ప్రకటించారు. అందే శ్రీ పాట విషయంలో తమకు ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు. ఒక గొప్ప పాటను అందే శ్రీ రాశారని కొనియాడారు. కేసీఆర్ అరాచకాలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయని.. ఎంపీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ డబుల్ డిజిట్ వస్తుందని లక్ష్మణ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాల తరువాత తెలంగాణ రాష్ట్రంలో అనేక రాజకీయ మార్పులు రాబోతున్నాయన్నారు. ఐదేళ్లు కాంగ్రెస్ కొనసాగాలని ప్రజాస్వామ్య వాదిగా కోరుకుంటున్నానని.. సీఎం రేవంత్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లక్ష్మణ్ అన్నారు.

## కవితకు మరో షాక్.. రౌస్ అవెన్యూ కోర్టు సంచలన నిర్ణయం..

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులోఎమ్మెల్సీ కవితను కష్టాలు వెంటాడుతున్నాయి. ఓవైపు బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నా ఇప్పటివరకు ఉపశమనం కలగకపోవడంతో కవిత తీహార్ జైలులోనే ఉన్నారు. దేశ వ్యాప్తంగా పెను సంచలనంగా మారిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవితపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌పై రౌస్ అవెన్యూ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. కవితపై దాఖలైన ఛార్జిషీట్‌ను కోర్టు పరిగణలోకి తీసుకోవటమే కాకుండా.. జూన్ 3వ తేదీన ఛార్జిషీట్‌లో పేర్కొన్న నిందితులందరూ కోర్టు ఎదుట హాజరు కావాలంటూ సమన్లు జారీ చేసింది. దీంతో వచ్చే నెల 3న కవితను జైలు అధికారులు కోర్టులో ప్రవేశపెట్టున్నారు.

**ఈడీ వాదన ఇదే..** విచారణకు తగిన సాక్ష్యాలు ఉన్నాయంటూ న్యాయస్థానంలో ఈడీ చేసిన వాదనలను విన్న ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా.. తీర్పును రిజర్వ్ చేశారు. ఈరోజు ఈడీ ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకుంటున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. మరోవైపు కవిత బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టులో మంగళవారం వాదనలు పూర్తయ్యాయి. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు జడ్జి స్వర్ణకాంత




శర్మ తీర్పును రిజర్వు చేశారు.

**జూన్3న కోర్టుకు కవిత..** రౌస్ అవెన్యూ కోర్టు ఈడీ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకుని.. నిందితులుగా ఉన్న వారందరిని విచారణకు పిలవడంతో ఈకేసు మరెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి. కోర్టు ఆదేశాలతో కవితతో సహా నిందితులంతా కోర్టులో హాజరుకావాల్సి ఉంటుంది. మరోవైపు జూన్4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న విషయం తెలిసిందే.

## ఏసీపీ ఉమామహేశ్వరరావును కస్టడీకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైన హైదరాబాద్ సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావును పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. రెండు గంటలుగా ఉమామహేశ్వరరావు ని ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నారు. ఉమామహేశ్వరరావును ముగ్గురు అధికారుల బృందం విచారణ చేస్తోంది. ఉమామహేశ్వరరావు భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు. బినామీ ఆస్తులపై కూడా ఏసీబీ విచారణ చేస్తోంది. రెండు బ్యాంక్ లాకర్లను ఏసీబీ అధికారులు ఓపెన్ చేయనున్నారు. ఏసీబీ విచారణలో మరి కొంత మంది బినామీలు వ్యవహారం బయట పడే అవకాశం ఉంది. ఇబ్రహీంపట్నంలో ఏసీపీగా పని చేసిన సమయంలో జరిగిన అక్రమాలపై లోతుగా విచారణ నిర్వహిస్తున్నారు.

అక్రమాస్తుల వివరాలను వెలికి తీసేందుకు ఏసీపీని తమ కస్టడీకి అప్పగించాలంటూ అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు సానుకూలంగా స్పందించి.. మూడు రోజుల పాటు కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఏసీపీ ఉమామహేశ్వరరావు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ నెల 22న ఆయన నివాసంలో అధికారులు సోదాలు చేసి రూ.3.95 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. ఆ వెంటనే ఏసీపీని అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా.. ఉమా మహేశ్వరరావుకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. చంచల్‌గూడ జైలులో ఉన్న ఆయనను నేడు అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660